క్లుప్తంగా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బొబ్బిలి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి అన్నారు. పౌష్టికాహార మహోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని తారకరామ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై సోమవారం అవగాహన కల్పించారు. మనం ప్రతిరోజూ తినే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కమ్మవలసలో నేత్రవైద్య శిబిరం


రోగి కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు

బొబ్బిలి: మండలంలోని కమ్మవలస గ్రామంలో నేత్రవైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యనిపుణులు శిబిరానికి హాజరైన వృద్ధుల కంటిని పరీక్షించారు. అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు అందజేశారు.

శరవేగంగా గృహ నిర్మాణాలు


రాజాం జగనన్న కాలనీ లే-అవుట్ దగ్గర జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు

రాజాం: పట్టణ పరిధిలోని కంచరాం లే-అవుట్ దగ్గర టిడ్కో కాలనీ పక్కన జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. మొత్తం 1112 ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండగా, వీటిలో కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని శ్లాబు, ఇంకొన్ని పునాది దశలో ఉన్నాయి. ఆయా నిర్మాణాలను సోమవారం పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇంటి నిర్మాణ సామగ్రితో పాటు బిల్లులు కూడా సకాలంలో చెల్లిస్తున్నామన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు


విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బాడంగి: మండలంలోని భీమవరం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం రక్త పరీక్షలు చేశారు. వాడాడ పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బంది ఒక్కో విద్యార్థికి రక్తపరీక్ష చేసి, రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఐరన్ మాత్రలు అందజేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం శ్రీలక్ష్మి, వీఎల్‌హెచ్‌పీ అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి


సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు

రేగిడి: అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సోమవారం సమావేశమైన ఆయన గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఏపీఎం టి.మంగమ్మ, ఈఓపీఆర్‌డీ శశిభూషణరావు, ఏపీఓ హరనాధరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌డీఓ సందర్శన


మెట్టవలస గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ రవీంద్ర

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస గ్రామ సచివాలయాన్ని డీఎల్‌డీఓ పి.రవీంద్ర సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ అల్లు భాస్కరరావు ఉన్నారు.

'జగనన్నకు చెబుదాం'..

సమస్యలు పరిష్కరించుకుందాం

- ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం
- వినతులు సమర్పించిన ప్రజలు
- సమస్యల పరిష్కారానికి అధికారుల హామీ


రామభద్రపురం: అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ రమామణి


తెర్లాం: మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం కానున్నాయని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇకపై సమస్యల పరిష్కారానికి ఎవ్వరూ జిల్లా కేంద్రంలోని స్పందన కార్యక్రమానికి వెళ్లనవసరం లేదన్నారు. ప్రతీ సోమవారం మండల కేంద్రంలో జరిగే స్పందన కార్యక్రమంలోనే వినతి పత్రాలు సమర్పించి, సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోనే అన్ని శాఖల అధికారులతో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మండలంలోని ప్రజలకు ఏ సమస్య ఉన్నా అర్జీ రూపంలో సమర్పిస్తే నిర్ణీత గడువులోగా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వినతుల ద్వారా ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కరించి, వారిలో సంతోషం చూడాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రామభద్రపురం: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమామణి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి స్పందన కార్యక్రమంలో మండల స్థాయి అధికారులంతా పాల్గొని, ప్రజలు సమర్పించిన వినతులు స్వీకరించి, పరిశీలించారు. అనంతరం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అధికారులు కూడా ప్రజల సమస్యల వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలన్నారు.


మెంటాడ: స్పందన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మెంటాడ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ త్రివిక్రమ్ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి స్పందన కార్యక్రమంలో ఏ ఒక్కరూ సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు సమర్పించకపోవడం విశేషం. అయితే సాయంత్రం నాటికి రాబంద గ్రామానికి చెందిన యువత గ్రామంలో రచ్చబండ నిర్మించాలని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం సమర్పించారు.

జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై దిశానిర్దేశం


బూసాయవలస సచివాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: మండలంలోని పాతరేగ, దుప్పలపూడి, ఆరికతోట, బూసాయవలస గ్రామ సచివాలయాలను ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సోమవారం సందర్శించారు. అక్కడి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు ఏప్రిల్ ఏడో తేదీ నుంచి చేపట్టనున్న జగన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రతిఒక్కరూ వచ్చే ఎన్నికల్లో గెలుపే ప్రధాన లక్ష్యంగా అహర్నిశలు పార్టీ కోసం కష్టపడి పనిచేయాలన్నారు. ప్రతిపక్షాల ఆరోపణలు, మోసపూరిత రాజకీయాలను ప్రజలకు వివరించాలన్నారు. టీడీపీ హయాంలో జరిగిన పాలనకు, మన పార్టీ హయాంలో జరుగుతున్న పాలనకు ఉన్న తేడాను స్పష్టంగా ప్రజలకు తెలియజెప్పాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పాతరేగ, కొత్తరేగ, ఆరికతోట, దుప్పలపూడి సర్పంచ్‌లు జి.పైడిపునాయుడు, కె.మురళి, పి.పుష్పమ్మ, వై.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన


జీవామృతం తయారీని వివరిస్తున్న నైరా కళాశాల విద్యార్థులు

రాజాం సిటీ: రైతులంతా పంటలకు వేస్తున్న రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువుల్లో భాగమైన జీవామృతం వినియోగిస్తే సాగులో మంచి ఫలితం ఉంటుందని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. సోమవారం మండలంలోని అంతకాపల్లి గ్రామంలో జీవామృతం తయారీపై రైతులకు వారు అవగాహన కల్పించారు. 200 లీటర్ల నీరు పట్టే డ్రమ్ము తొలుత తీసుకుని, దానిలో 2 కేజీల బెల్లం, మరో 2 కేజీల శనగపిండి, 10 లీటర్ల గోమూత్రం, 10 కేజీల ఆవుపేడ, అరకేజీ పుట్టమన్ను, 180 లీటర్ల నీటిలో ఓ రాత్రంతా నానబెట్టాలి. మరుసటి రోజు ఆ నీటిని గడ్డలు లేకుండా కలుపుకోవాలి. ఇలా కలిపిన ద్రావణాన్ని 7 నుంచి 10 రోజుల పాటు మురగబెట్టుకుంటే జీవామృతం తయారవుతుందన్నారు. పంటకు నీరందించిన తర్వాత రోజు మొక్క మొదలుకు చేరుకునేలా జీవామృతాన్ని అందించాలని సూచించారు. వరి చేనుకు ఎకరాకు రెండు డ్రమ్ములు, మొక్కజొన్నకు అయితే ఐదు డ్రమ్ములు చొప్పున అందించాలన్నారు. ఇలా చేయడం ద్వారా చీడపీడల నివారణతో పాటు సాగుకు ఖర్చు తక్కువై, దిగుబడులు సాధించేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు సీహెచ్ ప్రసన్న, కె.సాహితి, కె.స్నేహిత, రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సోమవారం సమావేశమైన ఆయన పారిశుద్ధ్య పరిస్థితులపై సమీక్షించారు. సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకుండా ఎప్పటికప్పుడు సిబ్బంది పారిశుద్ధ్య చర్యలు చేపట్టేలా చూడాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా మురుగు సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి కాలువ మరమ్మతులకు చర్యలు


తోటపల్లి సాగునీటి కాలువను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వంగర: తోటపల్లి సాగునీటి కాలువ మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నామని వైస్ ఎంపీపీ పున్నాన సత్యన్నారాయణ అన్నారు. సోమవారం కాలువను పరిశీలించిన ఆయన పనులకు ఎంపీ నిధుల నుంచి రూ.2 లక్షలు మంజూరైందని తెలిపారు. వీటితో కాలువ మరమ్మతు పనులు చేపట్టి, సాగునీటి సరఫరాకు అధికారులు చర్యలు చేపడతారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పొటాష్ అమ్మకాలు పెంచాలి

మెంటాడ: రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ ఉన్న పొటాష్ అమ్మకాలు పెంచాలని మండల వ్యవసాయాధికారి గోకుల్‌కృష్ణ ఆదేశించారు. సోమవారం మండలంలోని జయితి, ఇప్పలవలస, పోరాం, జక్కువ, గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను సందర్శించిన ఆయన తొలుత పీఎం కిసాన్, ఈకేవైసీ ప్రక్రియలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రబీలో పెసలు, మినుముల సాగుకు విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆర్‌బీకే సిబ్బందిలో ఎవరు విధులు సక్రమంగా నిర్వర్తించకపోయినా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సిబ్బంది కూడా రైతులకు అందుబాటులో ఉండి, సేవలందించాలన్నారు. అనంతరం రైతులకు పీఎం కిసాన్ పత్రాలు అందజేశారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు

తెర్లాం: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంగా ఎవరైనా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడినట్లు తెలిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఆర్.రమేష్ హెచ్చరించారు. సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన బెట్టింగ్‌ల కోసం లోన్ యాప్‌ల ద్వారా ఎవరూ అప్పులు చేయొద్దన్నారు. గంజాయి, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలు అమ్మినా, కొనుగోలు చేసినా, సేవించినా చర్యలు తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే 9121109458 అనే ఫోన్ నంబర్‌ను సంప్రదించి, ఫిర్యాదు చేయాలన్నారు.

బహిరంగ మలవిసర్జన నిర్మూలనే 'ఆప్రో' లక్ష్యం

మెంటాడ: గ్రామాల్లో బహిరంగ మలవిసర్జన నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా ఆప్రో సంస్థ పనిచేస్తోందని ఎంపీపీ ఆర్.ఎస్.నాయుడు అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని చింతలవలస గ్రామంలో ఆప్రో సంస్థ రూ.3.30 లక్షల వ్యయంతో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు రోగాల బారినపడకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కలిశెట్టి సూర్యానారాయణ, ఎంపీడీఓ త్రివిక్రమ్, ఆప్రో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం

రాజాం: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణంలో మంగళవారం ఉదయం 11 గంటలకు వైఎస్సార్ ఆసరా పథకం నిధుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ లావేటి సులోచన, వైస్ ఎంపీపీలు యాలాల సునీత, నక్క వర్షిణి సోమవారం తెలిపారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొనే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ ఆసరా పథకం నిధుల చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహన్‌రావు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని, మండల స్థాయి అధికారులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, లబ్ధిదారులంతా హాజరుకావాలని వారు కోరారు.

ఆక్రమణలు అడ్డుకోవాలి

రాజాం సిటీ: స్థానిక పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆక్రమణకు గురైన చెరువులను గుర్తించి, ఆక్రమణలను అడ్డుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎం.మధుసూధనరావు కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక తహసీల్దార్ పి.విజయభాస్కర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. చెరువులను రీ-సర్వే చేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే చెరువు గర్భాల్లోని పూడికలు తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

బాడంగి: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు సూచించారు. సోమవారం మండలంలోని భీమవరం, ముగడ, గొల్లాది, గజరాయునివలస గ్రామ సచివాలయాల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశమైన ఆయన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ద్వారా ప్రతీ ఇంటికి వెళ్లి, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు


మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

- మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు

బొబ్బిలి: అర్హతే ప్రామాణికంగా ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అన్నారు. స్థానిక పట్టణంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు మా నమ్మకం నువ్వే జగన్ కిట్లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 7వ తేదీ నుంచి జరిగే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో అందరూ పాల్గొని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ సమష్టిగా పనిచేయాలని, ప్రతిపక్షాలు ఆరోపణలు తిప్పికొట్టాలన్నారు. అన్ని వర్గాలకు మేలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని, కుల, మత, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందిస్తోందన్నారు. ఇదే విషయాన్ని ఇంటింటికీ వెళ్లి, వారికి అర్థమయ్యేలా చెప్పి, ప్రభుత్వ గొప్పతనం తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇంటి గోపాలరావు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు(విసు) తదితరులు పాల్గొన్నారు.


వంగర: గృహసారథులకు మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం..

వంగర: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. మండలంలోని మగ్గూరు, వంగర, శివ్వాం గ్రామాల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సోమవారం సమావేశమైన ఆయన ఈ నెల ఏడో తేదీ నుంచి జరగనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ ఎం.విజయలక్ష్మి, మండల పార్టీ కన్వీనర్ కె.సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి


అధికారులకు సూచనలిస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ

వంగర: అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, సేవలందించాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమానికి హాజరైన ఆయన ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హతే ప్రామాణికంగా పంపిణీ చేయాలన్నారు. అలాగే అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. అనంతరం ఇంటి పన్ను, ఈ-సర్వీసులు, గృహాల మంజూరు, రిజిస్ట్రేషన్‌పై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ డి.ఐజాక్, ఈఓపీఆర్‌డీ ఎల్.త్రినాథ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు

సంతకవిటి: మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన వేసవి నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సదుపాయంపై ఆరాతీశారు. అలాగే పారిశుద్ధ్య చర్యలు, చెత్త సంపద తయారీ కేంద్రంలో ఎరువుల తయారీ, ప్రభుత్వ భవనాల నిర్మాణం, జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై చర్చించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి తదితరులు పాల్గొన్నారు.

అనధికార చిట్స్ నిర్వహిస్తే బైండోవర్ కేసులు


మాట్లాడుతున్న సీఐ రవికుమార్

రాజాం సిటీ: గ్రామాల్లో నిర్వహిస్తున్న అనధికార చిట్స్ బారినపడి ఎవరూ మోసపోవద్దని రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ సూచించారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన అనధికార చిట్స్ నిర్వహిస్తున్న వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయనున్నామని తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో దూర ప్రాంతాలకు క్యాంపులు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రయాణ వివరాలు ముందుగానే పోలీసులకు తెలియజేస్తే ఇంటి దగ్గర గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. విలువైన వస్తువులు ఇళ్లల్లో ఉంచకూడదని, గ్రామాల్లో అపరిచిత, అనుమానిత వ్యక్తులు సంచరిస్తే మహిళా పోలీసులకు గానీ, 100కు గానీ, 112కు గానీ సమాచారం ఇవ్వాలన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టిసారించాలి

రాజాం: మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమావేశమైన ఆయన అభివృద్ధి పనులపై సమీక్షించారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలని ఏపీఓకు సూచించారు. ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జగన్‌మోహన్‌రావుకు తెలిపారు. మురుగు కాలువల ఇబ్బందులున్న చోట ఈ వేసవిలోనే పనులు చేయాలని పీఆర్‌జేఈ ప్రభాకరరావును కోరారు. అనంతరం స్పందన కార్యక్రమం నిర్వహించి, పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు. అలాగే అర్జీల్లోని సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

తొలిరోజు ప్రశాంతం..


తెర్లాం: పరీక్ష రాసేముందు సరస్వతీదేవిని మొక్కుతున్న విద్యార్థులు


బొబ్బిలి: చింతాడ జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ల నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


రామభద్రపురం ఉన్నత పాఠశాలలో రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పరీక్షలకు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా హాజరై, చక్కగా పరీక్షలు రాశారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా స్క్వాడ్ బృందం చర్యలు చేపట్టింది. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. - సాక్షి నెట్‌వర్క్


బాడంగి: జెడ్పీ హైస్కూల్‌లో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు


రాజాం: జెడ్పీ ఉన్నత పాఠశాలలో హాల్ టికెట్ నంబరు చూసుకుంటున్న విద్యార్థిని


రేగిడి: పరీక్ష రాయడంలో నిమగ్నమైన విద్యార్థులు


వంగర: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఐజాక్